ప్రజాశక్తి
ఆదివారం 10 సెప్టెంబర్ 2023 5 అనంతపురం

వేతనాలు చెల్లించాలని కోరితే
కార్మికులపై కేసులా..?
సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్.నాగేంద్రకుమార్

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

వేతనాలు చెల్లించాలని కోరుతూ నిరసన తెలిపిన తాగునీటి పథకం కార్మికులపై కేసులు నమోదు చేయడం బాధాకరమని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్.నాగేంద్రకుమార్ శనివారం ఒక ప్రకటనలో ఖండించారు. అడగడమే నేరం అంటే ప్రజాస్వామ్యంలో ఉన్నామా.. పోలీసుల రాజ్యంలో ఉన్నామా.. అర్థం కావడం లేదన్నారు. ముఖ్యంగా ఉరవకొండ సిఐ హరినాథ్ అధికార పార్టీ కార్యకర్తగా వ్యవహరిస్తుండడం బాధాకరమన్నారు. సమస్యలు పరిష్కరించాలని కోరుతూ దాదాపు 18 రోజులపాటు కార్మికులు కలెక్టరేట్ వద్ద శాంతియుతంగా నిరసనలు తెలిపారన్నారు. అయినా అధికారులు స్పందించకపోవడంతో ముందస్తుగా ప్రభుత్వానికి, సంబంధిత అధికారులకు సమ్మె నోటీస్ ఇచ్చి కార్మికులు సమ్మెలోకి వెళ్లారన్నారు. పది రోజులపాటు సమ్మె చేసినా అధికారులు స్పందించలేదన్నారు. 11వ రోజు అధికారులు వచ్చి కార్మికులు సమక్షంలో చర్చించి తక్షణం రెండు నెలలు వేతనాలు ఇస్తామని, వేతనాలు వారం రోజుల్లో చెల్లిస్తామని రాతపూర్వకంగా హామీ ఇచ్చారన్నారు. ఈనేపథ్యంలో అగ్రిమెంట్ ఉల్లంఘించిన వారిపై కేసును నమోదు చేయాల్సిన ఉరవకొండ సిఐ సమస్యల పరిష్కారానికి పోరాటం చేసిన సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఓబులు, నాయకులు బి.నాగరాజు, జి.రాము, ఎం.నాగరాజు, ఎస్.రామాంజనేయులు, జె.ప్రభాకర్, జి.ఎర్రిస్వామి, పి.అశోక్, తదితరులపై కేసు నమోదు చేయడం బాధాకరమన్నారు. కార్మికులకు వేతనాలు చెల్లిస్తామని హామీ ఇచ్చి విస్మరించిన ఆర్‌డబ్ల్యుఎస్ ఎస్‌సి, ఇఇ, డిఇ, జెఇపై కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. కేసులు పెడితే భయపడే ప్రసక్తే లేదన్నారు. చట్ట ప్రకారం కార్మికులకు రావాల్సిన న్యాయమైన వేతనాలు, పిఎఫ్, ఇఎస్ఐ, సమాన పనికి సమాన వేతనాలు ఇచ్చేంత వరకూ పోరాటం కొనసాగుతుందన్నారు. తక్షణమే కార్మిక సంఘాల నాయకులు, కార్మికులపై పెట్టిన కేసులను ఉపసంహరించుకోవాలని, లేనిపక్షంలో న్యాయ పోరాటం చేస్తామని హెచ్చరించారు.



తమ్ముళ్ల నిర్బంధం

- చంద్రబాబు అరెస్టుతో జిల్లాలో హైటెన్షన్
- ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా నేతల అరెస్టులు, గృహ నిర్బంధాలు
- అరెస్టుపై మండిపడ్డ టిడిపి శ్రేణులు

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

టిడిపి జాతీయ అధ్యక్షులు, మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు అరెస్టుతో ఉమ్మడి జిల్లాలో హై అలర్టు కొనసాగింది. శనివారం తెల్లవారుజాము నుంచే పోలీసులు అప్రమత్తయ్యారు. నిరసనలు, ఆందోళనలు చేపట్టే అవకాశముందని భావించిన నేతలందరినీ ముందస్తు అరెస్టులు చేశారు. గృహ నిర్బంధాలు చేశారు. చాలా మందిని పోలీసు స్టేషన్లకూ తీసుకెళ్లారు. ఆందోళనలు చోటు చేసుకునే అవకాశముందని భావించి ప్రభుత్వం ఉదయం నుంచే ఆర్టీసీ బస్సులను నిలిపివేసింది. ఉన్నఫలంగా డిపోల్లోకి బస్సులు రాకపోవడంతో ప్రయాణికులు తీవ్రమైన ఇబ్బందులు పడ్డారు. ఎటువంటి బంద్ ప్రకటన లేకుండా ఈ రకంగా బస్సులు ఆపడంతో దూర ప్రయాణాల కోసం సిద్ధమై వచ్చిన వారికి ఏమి చేయాలో పాలుపోని పరిస్థితి నెలకొంది. ఆ తరువాత పరిస్థితి అదుపులోనే ఉందని భావించాక బస్సు సర్వీసులు నడిచాయి.

నిరసనలు -అరెస్టులు

తెలుగుదేశం జాతీయ అధ్యక్షులు నారా చంద్రబాబునాయుడు అరెస్టును నిరసిస్తూ జిల్లా వ్యాప్తంగా తెలుగుదేశం నాయకులు, కార్యకర్తలు నిరసనలు చేపట్టారు. అన్ని మండల కేంద్రాల్లోనూ నిరసనలు చేపట్టగా అక్కడా అరెస్టులు జరిగాయి. అనంతపురం అర్బన్ మాజీ ఎమ్మెల్యే వైకుంఠం ప్రభాకర్ చౌదరిని పోలీసులు అరెస్టు చేసి త్రీటౌన్ పోలీసు స్టేషన్‌కు తరలించారు. ధర్మవరం టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి పరిటాల శ్రీరామ్‌ను అనంతపురం నగరంలో అరెస్టు చేసి త్రీటౌన్ పోలీసు స్టేషన్‌కు తరలించారు. మాజీ మంత్రి పల్లె రఘునాథ్‌రెడ్డిని అరెస్టు చేయడానికి అనంతపురం నగరంలోని ఆయన నివాసానికెళ్లగా ఆయన తప్పించుకుని పుట్టపర్తి నియోజకవర్గంలోని కొత్తచెరువుకు చేరుకున్నారు. అక్కడ రోడ్డుపై పడుకుని నిరసన చేపట్టారు. మాజీ ఎమ్మెల్సీ తిప్పేస్వామిని హౌస్ అరెస్టు చేశారు. గుంతకల్లు మాజీ ఎమ్మెల్యే జితేందర్‌గౌడ్‌ను పోలీసులు అరెస్టు చేశారు.

గుత్తిలో టిడిపి నాయకులను అరెస్టు చేస్తున్న పోలీసులు

గుండెపోటుతో టిడిపి నాయకుడు మృతి

గుత్తి : చంద్రబాబు అరెస్టు వార్తను టీవీలో చూస్తూ గుత్తికి చెందిన టిడిపి సీనియర్ నాయకుడు, వార్డు సభ్యుడు గుండెపోటుతో మరణించాడు. ఇందుకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి... గుత్తి మండలం ధర్మాపురం గ్రామానికి చెందిన టిడిపి సీనియర్ నాయకుడు, వడ్డే అంజినయ్య(55) ఇటీవల జరిగిన ఉప ఎన్నికల్లో గ్రామంలోని 4వ వార్డుకు టిడిపి మద్దతుతో వైసిపి అభ్యర్థిపై వార్డు సభ్యునిగా విజయం సాధించారు. శనివారం ఉదయం పొలం పనులకు వెళ్లిన ఆయన ఇంటికి వచ్చాడు. తమ పార్టీ అధినేత నారా చంద్రబాబు నాయుడు అరెస్టు వార్తను టీవీలో చూస్తూ ఒక్కసారిగా గుండెపోటుకు గురై కుప్పకూలి మతి చెందాడు. ఆయన మతి పట్ల టిడిపి నాయకులు సంతాపం వ్యక్తం చేశారు.

చంద్రబాబు అరెస్టు వార్త విని గుత్తిలో గుండెపోటుతో మృతి చెందిన టిడిపి నాయకుడు అంజినయ్య

రోడ్డు పనులు ప్రారంభిస్తున్న మంత్రి ఉషశ్రీచరణ్

వైసిపితోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యం
మంత్రి ఉషశ్రీచరణ్

ప్రజాశక్తి-కళ్యాణదుర్గం

వైసీపీ ప్రభుత్వ పాలనలోనే రాష్ట్రం అన్నిరంగాల్లో అభివృద్ధి సాధ్యమని మంత్రి ఉషశ్రీచరణ్ అన్నారు. శనివారం కళ్యాణదుర్గం-ఐదుకల్లు-బసాపురం బీటీ రోడ్డు పనులను మంత్రి ప్రారంభించారు. ఈసందర్భంగా మంత్రి మాట్లాడుతూ గత ప్రభుత్వ హయాంలో వివిధ గ్రామాలకు రోడ్డు మార్గం సరిగా లేకపోవడంతో ఆయా గ్రామాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారన్నారు. ఎన్నికల హామీల్లో భాగంగా ప్రతి నియోజకవర్గంలో అభివృద్ధి పనులు చేస్తున్నట్లు తెలిపారు. 15 ఏళ్ల నుంచి పెండింగ్‌లో ఉన్న రోడ్డుకు రూ.3.5కోట్ల నిధులు విడుదలయ్యాయన్నారు. దీంతో ఆయా గ్రామాల ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారన్నారు. ఈకార్యక్రమంలో కళ్యాణదుర్గం, శెట్టూరు, బ్రహ్మసముద్రం మండలాల వైసీపీ నాయకులు పాల్గొన్నారు.

చంద్రబాబు అరెస్టు తీరు అక్రమం : సిపిఎం

తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షుడు శ్రీ నారా చంద్రాబాబునాయుడును అరెస్టు చేసిన తీరు అక్రమం అని దీనిని ఖండిస్తున్నట్లు సిపిఎం జిల్లా కార్యదర్శి వి.రాంభూపాల్ తెలిపారు. ఈ మేరకు శనివారం ఆయన ప్రకటన విడుదల చేశారు. శుక్రవారం అర్థరాత్రి నంద్యాలలో చంద్రబాబు వసతి ప్రాంతపై దాడిచేసి, జనాన్ని భయభ్రాంతులకు గురిచేసి, తెల్లవారుజామున అరెస్టు చేసినతీరు అక్రమం అన్నారు. మాజీ ముఖ్యమంత్రి, ప్రధాన ప్రతిపక్షనేత జిల్లాల పర్యటనలో భాగంగా నంద్యాలలో ఉన్నప్పుడు అరెస్టు చేసిన తీరు తీవ్ర అభ్యంతరకరమన్నారు. చంద్రబాబును తక్షణమే విడిచిపెట్టి స్కిల్‌డెవలప్‌మెంట్ సెంటర్‌లో జరిగిన అవినీతి ఆరోపణలపై నిష్పక్షపాతంగా, చట్టబద్ధంగా విచారణ జరపాలని డిమాండ్ చేశారు. చంద్రబాబు అరెస్టును నిరసిస్తూ ఆందోళనకు దిగిన తెలుగుదేశం పార్టీ కార్యకర్తలను జిల్లా వ్యాపితంగా గహ నిర్బంధం చేయడం, ఎక్కడికక్కడ అరెస్టులు చేయడం, ఆయన కుమారుడు లోకేష్‌ను అనుమతించకపోవడం అప్రజాస్వామికం అన్నారు. ఈ అరెస్టులను సిపిఎం జిల్లా కమిటీ ఖండిస్తోందన్నారు. అరెస్టు చేసినవారిని తక్షణమే విడుదల చేయాలని కోరారు.

జగన్ కక్షదారుడు..! : బాలకృష్ణ

ప్రజా సంక్షేమాన్ని గాలికొదిలి ప్రతిపక్షనేతలపై కక్ష్యసాధింపులకు పాల్పడుతూ జగన్మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రిలా కాకుండా కక్షదారిడిగా పాలన సాగిస్తున్నారని హిందూపురం ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ ఆగ్రహం వ్యక్తం చేశారు. చంద్రబాబు నాయుడు అరెస్టుపై స్పందించి శనివారం ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. జగన్మోహన్‌రెడ్డి 16 నెలలు జైల్లో ఉన్నందున, చంద్రబాబు నాయుడిని కనీసం 16 నిమిషాలైన జైల్లో పెట్టాలన్న కక్షతో అక్రమ కేసులు బనాయిస్తున్నారని చెప్పారు. స్కిల్ డెవలెప్ మెంట్ కేసులో ఎలాంటి ఆధారాలు లేకుండా చంద్రబాబు నాయుడిని ఏ చట్టం ప్రకారం అరెస్ట్ చేశారని ప్రశ్నించారు. స్కిల్ డెవలప్ మెంట్ పెద్ద కుంభకోణమనేది ప్రచారం తప్పా, ఇందులో ఎలాంటి వాస్తవం లేదన్నారు. 2021లో ఎఫ్ఐఆర్ నమోదు చేసిన కేసులో ఇంతవరకు ఎందుకు ఛార్జ్‌షీట్ వేయలేదని ప్రశ్నించారు. జగన్ సీఎం అయ్యాక అన్నం తినటం మానేసి, కోర్టుల చేత చివాట్లు తింటున్నారన్నారు. ఇలాంటి అక్రమ అరెస్టులకు భయపడేది లేదని, దీనిపై న్యాయపోరాటం చేసి ప్రజా క్షేత్రంలో తేల్చుకుంటామని స్పష్టం చేశారు.

బాబు స్కిల్డ్ దొంగ : వైసిపి

చంద్రబాబు ఒక స్కిల్డ్ దొంగ అని వైసిపి ప్రజాప్రతినిధులు ఎద్దేవా చేశారు. శనివారం ఉదయం స్థానిక వైసిపి కార్యాలయంలో జరిగిన మీడియా సమావేశంలో ఎమ్మెల్యేలు అనంత వెంకటరామిరెడ్డి, ప్రకాశ్‌రెడ్డి, ఎంపీ గోరంట్ల మాధవ్, జిల్లా పరిషత్ ఛైర్మన్ బోయ గిరిజమ్మ, జిల్లా అధ్యక్షులు పైలా నరసింహయ్య తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చంద్రబాబు నాయుడు స్కిల్ డెవలప్‌మెంట్‌లో పక్కాగా తప్పు చేసారని ఆరోపించారు. రూ.118 కోట్ల నిధులను దారి మళ్లించారని తెలిపారు. సిఐడి ఆధారాలతో బయటపెట్టినందుకే అరెస్టులు జరుగుతున్నాయన్నారు. లక్షలాది మంది నిరుద్యోగులకు ఉపాధి అవకాశాలు కల్పిస్తామంటూ చెప్పి ఆ డబ్బులను కాజేసిన దోపిడీ దొంగ చంద్రబాబు అని ఆరోపించారు. ఈ ఒక్క విషయంలోనే కాకుండా అన్నింటిలోనూ అదే రకంగా వ్యవహరించారన్నారు.

క్షణికావేశానికి లోనుకావొద్దు
ఆత్మహత్యల నివారణ దినోత్సవంలో వక్తలు

ప్రజాశక్తి-నార్పల

మానసిక సమస్యలతో బాధపడుతున్న వారు క్షణికావేశాలకు లోనుకావొద్దని మానసిక వైద్య నిపుణులు విశ్వనాథరెడ్డి, డాక్టర్ రవిశంకర్ సూచించారు. ఆత్మహత్యల నివారణ దినోత్సవం సందర్భంగా శనివారం మండల పరిధిలోని బి.పప్పురు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ గురుకుల పాఠశాలలో మానసిక జబ్బులపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇటీవల కాలంలో చాలామంది మానసిక సమస్యలతో క్షణికావేశంలో ఆత్మహత్యలు చేసుకుంటున్నారన్నారు. ఆత్మవిశ్వాసానికి మించిన శక్తి ఏదీ లేదన్నారు. కావున మానసికంగా కుమిలిపోయే వారికి ధైర్యం కల్పించాలని ఇలాంటి కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అలాగే విద్యార్థులు పరీక్షలు సమీపించే కొద్దీ మానసిక ఆందోళనకు లోనై పరీక్షల్లో ఎక్కడ ఫెయిల్ అయిపోతామని భావించి ఆత్మహత్యలకు పాల్పడుతున్నారన్నారు. కావున తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు కూడా విద్యార్థులపై ఒత్తిడి తీసుకురాకూడదన్నారు. ఈ కార్యక్రమంలో పప్పూరు ప్రాథమిక వైద్యశాల వైద్యులు రవిశంకర్, సూపర్‌వైజర్లు శ్రీరాములు, సరస్వతమ్మ, ఎంపిహెచ్ఒ సుబ్రమణ్యాం, ఏఎన్ఎం ఫరీదా, ఆశా కార్యకర్తలు, విద్యార్థులు, గ్రామస్తులు, తదితరులు పాల్గొన్నారు.

అవగాహన కార్యక్రమంలో మాట్లాడుతున్న మానసిక వైద్యులు

అడ్డంగా దొరికిపోయినా బుకాయింపులా?
అనంతపురం ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి

ప్రజాశక్తి-అనంతపురం

స్కిల్ డెవలప్‌మెంట్ స్కాంలో అడ్డంగా దొరికిపోయిన టిడిపి అధినేత చంద్రబాబును పోలీసులు అరెస్టు చేయడంతో బుకాయింపు చర్యలకు పాల్పడటం బాధాకరమని ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి అన్నారు. శనివారం నగరంలోని వైసీపీ జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ చంద్రబాబు 2014 నుంచి 2019 వరకూ అధికారంలో ఉండి చేసిన అతి పెద్ద స్కాం స్కిల్ డెవలప్‌మెంట్ స్కాం అన్నారు. సెల్ కంపెనీల ద్వారా రూ.371 కోట్లను మళ్లించారని, ఇందులో అంతిమ లబ్ధిదారుడు చంద్రబాబేననితేలిందన్నారు. అయితే జగన్ సిఎం అయ్యాక బటన్ నొక్కితే నిధులు ప్రజల ఖాతాల్లో జమ అవుతుంటే.. చంద్రబాబు పాలనలో ఆయన బటన్ నొక్కితే నిధులన్నీ మళ్లీ ఆయన ఖాతాలోకే వచ్చాయనడానికి స్కిల్ డెవలప్‌మెంట్ స్కాం నిదర్శనమన్నారు. ఈస్కాంలో తన రాజకీయ అనుభవాన్నంతా వాడుకున్నారని తెలిపారు. సీమెన్స్ కంపెనీ పేరుతో దోపిడీకి పాల్పడ్డారన్నారు. రూ.3365 కోట్లతో ప్రాజెక్ట్ అని చెప్పి అందులో 10 శాతం వాటా ప్రభుత్వానిదని, 90 శాతం వాటా సీమెన్స్ కంపెనీ భరిస్తుందని మాయమాటలు చెప్పారన్నారు. యువతకు నైపుణ్యం పేరుతో షెల్ కంపెనీలు సృష్టించి రూ.371 కోట్ల నిధులు మళ్లించి చంద్రబాబు అడ్డంగా దొరికిపోయారని చెప్పారు. అనేక కేసుల్లో ఈరోజుకీ విచారణ జరగకుండా చేస్తున్నారన్నారు. తాను అరెస్టు అవుతానని తెలిసే పక్కా ప్లాన్ ప్రకారం రాయలసీమలో పర్యటిస్తూ చంద్రబాబు సానుభూతి రాజకీయాలు చేశారన్నారు. ప్రభుత్వాన్ని బెదిరించే ప్రయత్నం చేశారని తెలిపారు. చంద్రబాబేమీ చట్టానికి అతీతుడు కాదని స్పష్టం చేశారు. చంద్రబాబును అరెస్ట్ చేస్తే ఎల్లో మీడియా కూడా ప్రజలను రెచ్చగొట్టే ప్రయత్నాలు చేస్తోందన్నారు. తప్పు చేసిన వారికి శిక్ష తప్పదని, ఈ కేసులో తన నిజాయితీని నిరూపించుకోవాల్సిన బాధ్యత చంద్రబాబుదేనన్నారు. చంద్రబాబు 14 ఏళ్లు ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో చేసిన స్కాంలలో ఇది ఒకటి మాత్రమేనన్నారు. స్కిల్ డెవలప్‌మెంట్ స్కాం జరిగిన గత ప్రభుత్వంలోని మంత్రివర్గంలో బీజేపీ ఉందని, ప్రభుత్వానికి జనసేన మద్దతుగా ఉందన్నారు. ఈ స్కాంలో అప్పటి మంత్రివర్గం బాధ్యత కూడా ఉందన్నారు. చంద్రబాబుపై కక్ష సాధింపు చర్యలకు దిగాల్సిన అవసరం తమకు లేదని, చట్టం తన పని తాను చేసుకెళ్తోందని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో వైసిపి జిల్లా అధ్యక్షుడు పైలా నర్సింహయ్య, రాప్తాడు ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి, ఎంపీ గోరంట్ల మాధవ్, జెడ్పీ ఛైర్‌పర్సన్ గిరిజమ్మ, తదితరులు పాల్గొన్నారు.

విలేకరులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి

స్వగ్రామానికి జవాన్ మృతదేహం

ప్రజాశక్తి-గార్లదిన్నె

మండల పరిధిలోని పెనకచర్ల డ్యాం గ్రామానికి చెందిన బిఎస్‌ఎఫ్ జవాన్ బోయ నారాయణస్వామి మృతదేహం శనివారం స్వగ్రామానికి చేరుకునింది. పశ్చిమబెంగాల్‌లో విధులు నిర్వహిస్తున్న నారాయణస్వామి గత శుక్రవారం తెల్లవారుజామున అనుమానాస్పదంగా మృతిచెందిన విషయం తెలిసిందే. దీంతో మృతదేహాన్ని శనివారం పశ్చిమ బెంగాల్ నుంచి బెంగళూరుకు ప్రత్యేక విమానంలో, అక్కడి నుంచి ఆర్మీ వాహనంలో స్వగ్రామం పెనకచర్ల డ్యాంకు తీసుకొచ్చారు. మృతదేహానికి స్నేహితులు, గ్రామ ప్రజలు బైక్ ర్యాలీగా వెళ్లి స్వాగతం పలికారు. అంత్యక్రియలను ఆదివారం స్వగృహంలో నిర్వహించనున్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.

ప్రయివేటు పాఠశాలలపై చర్యలు తీసుకోవాలి
ఎస్‌ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు బంగి శివ

ప్రయివేటు పాఠశాల యాజమాన్యంతో వాగ్వివాదం చేస్తున్న ఎస్‌ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు బంగి శివ

ప్రజాశక్తి-రాయదుర్గం

పట్టణంలో నిబంధనలకు విరుద్ధంగా నడుస్తున్న ప్రయివేటు పాఠశాలలపై ఉన్నతాధికారులు వెంటనే చర్యలు తీసుకోవాలని ఎస్‌ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు బంగి శివ డిమాండ్ చేశారు. ఈమేరకు శనివారం సెలవు దినం అయినా తరగతులు నిర్వహిస్తున్న పాఠశాలలకు ఎస్‌ఎఫ్ఐ నాయకులు వెళ్లి అడ్డుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పట్టణంలోని పలు ప్రయివేటు పాఠశాలల యాజమాన్యాలు సెలవు రోజుల్లో కూడా తరగతులు నిర్వహిస్తున్నాయన్నారు. అంతేగాకుండా విద్యార్థుల తల్లిదండ్రుల నుంచి అధిక ఫీజులు వసూలు చేయడంతోపాటు పుస్తకాల పేర ఎక్కువ డబ్బు వసూలు చేస్తున్నట్లు ఆరోపించారు. ఇవన్నీ స్థానిక మండల విద్యాశాఖ అధికారి దృష్టికి తీసుకెళ్లినా పటించుకోవడం లేదన్నారు. ఇప్పటికైనా విద్యాశాఖ ఉన్నతాధికారులు జోక్యం చేసుకుని నిబంధనలు ఉల్లంఘించిన పాఠశాల యాజమాన్యాలు, ఎంఇఒపై చర్య తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ఆందోళనలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

పొలిటికల్ హీట్

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

జిల్లాలో పొలిటికల్ హీట్ పెరుగుతోంది. సార్వత్రిక ఎన్నికలు సమీస్తున్న తరుణంలో టిడిపిలో చోటు చేసుకుంటున్న పరిణామాలు ఉత్కంఠతను రేపుతున్నాయి. ఏమి జరుగుతుందోనన్న గుబులు ఆ పార్టీ శ్రేణుల్లోనూ కనిపిస్తోంది. టిడిపి జాతీయ అధ్యక్షులు నారా చంద్ర బాబు నాయుడు అనంతపురం జిల్లాలో ఈ వారంలో పర్యటించారు. రాయదుర్గం, కళ్యాణదుర్గం, గుత్తి నియోజకవర్గాల్లో పర్యటించారు. ఇది ముగిసిన అనంతరం కర్నూలు జిల్లాలో పూర్తి చేసుకుని నంద్యాలలోకి ప్రవేశించారు. అక్కడ శనివారం ఉదయం సిఐడి పోలీసులు అరెస్టు చేశారు. ఈ విషయాన్ని అంతకు మునుపే జిల్లా పర్యటనలో ప్రస్తావించడం ఇప్పుడు చర్చనీయాంశమైంది. ఈ ప్రభుత్వం ఎవరినీ వదలడం లేదు. తననూ అరెస్టు చేస్తుందేమోనని చెప్పడం, ఆ విధంగానే అరెస్టు చేయడం జరిగింది. అరెస్టు చేస్తున్నారని తెలిసాక టిడిపి శ్రేణులు నిరసనకు దిగేందుకు సిద్ధమయ్యారు. దీన్ని దృష్టిలో ఉంచుకుని . ముఖ్యమైన నాయకులందరినీ ముందస్తుగా అరెస్టు చేసి స్టేషన్లకు తరలించారు. పొలిటికల్‌గా ఇదే ఈ వారం ప్రధాన అంశంగా మారింది. బాబు ష్యూరిటీ-భవిష్యత్‌కు గ్యారెంటీ పేరుతో చంద్రబాబు మూడు రోజులు జిల్లాలో పర్యటించారు. ఈ సందర్భంగా వివిధ వర్గాల ప్రజలతోనూ ముఖాముకి నార్వహించారు. ప్రభుత్వ వైఫల్యాలను ఎత్తి చూపుతూనే.. తాము అధికారంలోకి వస్తే ఏమి చేస్తామన్నది చెప్పారు. మూడు నియోజకవర్గాల్లో పర్యటించడమే కాకుండా టిడిపి శ్రేణులను యాక్టివ్ చేసే ప్రయత్నం చేశారు. కొన్ని నెలల్లో సార్వత్రిక ఎన్నికలు వస్తున్న సమయంలో టిడిపిలో చోటు చేసుకుంటున్న పరిణామాలు ఆ పార్టీ నేతల్లో గుబులు రేపుతోంది. అందరూ ఎన్నికలకు సన్నద్ధమవుతున్న సమయంలో ఆ పార్టీ జాతీయ అధ్యక్షులు నారా చంద్రబాబునాయుడ జైలుకెళ్లే పరిస్థితి రావడం ఆ పార్టీ శ్రేణులను గందరగోళ పరిస్థితుల్లోకి నెట్టేస్తోంది. నాయకులు, కార్యకర్తలు అరెస్టుకు వ్యతిరేకంగా నిరసనలు చేపడుతున్నారు. ఇక ఈ వారంలో ముందుకొచ్చిన అంశం వర్షాలు పడటం. ఆగస్టులో తీవ్ర వర్షాభావ పరిస్థితులు నెలకొన్నాయి. 83 శాతం వర్షాభావం నెలకుని పంటలు పూర్తిగా ఎండిపోయే దశకు వచ్చాయి. ఈ సమయంలో సెప్టంబర్‌లో వర్షాలు పడటం కాస్త ఊరటనిచ్చింది. అయితే మండలాల వారీగా చూస్తే ఇప్పటికీ చాలా మండలాల్లో చాలా మండలాల్లో ఇంకా కురవాల్సినంత వర్షం కురవలేదు. పడిన అరకొర వర్షంలోనైనా ప్రత్యామ్నాయ పంటలు సాగు చేసుకుందామంటే పూర్తి స్థాయిలో విత్తనాలు అందుబాటులో లేవు. రిజిస్ట్రేషన్ ప్రక్రియనే కొనసాగుతోంది. అవి ఇచ్చేలోపు నెలలో తేమ తగ్గిపోయే అవకాశముంది. గత వారంలో వర్షాలొచ్చినప్పటికీ అన్ని మండలాల్లో ఒకే రూపకంగా పడలేదు. ఇప్పటికీ చాలా మండలాల్లో వర్షాభావ పరిస్థితులే నెలకొన్నాయి. ప్రధానంగా సత్యసాయి జిల్లాలో ఎక్కువగానున్నాయి. ముదిగుబ్బ మండలంలో 50 శాతానికిపైగా వర్షపాతలోటుంది. ఈ ప్రాంతాల్లో పంటల సాగు కూడా పెద్దగా జరగలేదు. ఖరీఫ్ ఆశలు పూర్తిగా సన్నగిల్లినట్లుగానే జిల్లాలో కనిపిస్తోంది. సాగునీటి కష్టాలు కూడా అధికంగా ఈ ఏడాది కనిపిస్తోంది. తుంగభద్ర ఎగువ ప్రధాన కాలువకు గత వారంలో కర్నాటకలో గండిపడింది. దీంతో రెండు, మూడు రోజులు నీటిని నిలువదల చేశారు. ఖరీఫ్ ముగుస్తున్నా ఇప్పటికీ సాగునీటి సలహామండలి సమావేశం సైతం జరగలేదు. దీంతో ఇప్పటికీ పంట కాలువలకు నీటి సరఫరాపై స్పష్టతరాలేదు. ఎప్పుడూ ఐఎబి సమావేశం జరుగుతుందో కూడా తెలియకుండా ఉంది.

చంద్రబాబు అరెస్టుతో వెల్లువెత్తిన నిరసనలు

ఎక్కడికక్కడ టిడిపి నేతల అరెస్టులు..

నేలపై కూర్చొని నిరసన తెలుపుతున్న అర్బన్ బ్యాంకు ఛైర్మన్ జె.ఎల్.మురళీధర్, టిడిపి నాయకులు

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

చంద్రబాబు అరెస్టును నిరసనగా టిడిపి శ్రేణులు భగ్గుమన్నారు. నగరంలోని పలుచోట్ల ధర్నాలు నిరసనలు వ్యక్తం చేశారు. ఇందులో భాగంగా మాజీ ఎమ్మెల్యే వైకుంఠం ప్రభాకర్‌చౌదరిని నివాసంలో ఉదయం ఆరు గంటలకే పోలీసులు అరెస్టు చేసి 3వ పట్టణ స్టేషన్ కు తరలించారు. దీంతో ఆయన స్టేషన్‌లోనే నిరసన దీక్షకు దిగారు. విషయం తెలుసుకున్న కార్యకర్తలు అక్కడకు చేరుకుని నిరసన తెలిపారు. మరోవైపు జిల్లాలో బస్సులు తిరగకపోవడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. మరోవైపు సప్తగిరి సర్కిల్ వద్ద తెలుగు యువత నాయకులు బంగినగా ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. పాతూర్‌లో వాటర్ ట్యాంక్ ఎక్కి సరిపూటి రమణ, ముక్తియార్, తదితరులు నిరసన తెలిపారు. ఆయా కార్యక్రమాల్లో మాజీ డిప్యూటీ మేయర్ సాకే గంపన్న, దేవళ్ల మురళి, దలవాయి వెంకటనారాయణ, సిమెంటు పోలన్న, డిష్ నాగరాజు, డాక్టర్ లక్ష్మీప్రసాద్, స్వామి దాస్,దాసరి శ్రీధర్, గోళ్ల పరంధామయ్య, గొల్ల సుధాకర్ నాయుడు, తెలుగు మహిళలు స్వప్న, విజయ్ శ్రీ రెడ్డి, బల్లె శివబాల, గాండ్ల విశాలాక్షి, జానకి, సరళ, దేవి, తదితరులు పాల్గొన్నారు.

అలాగే శాంతియుత నిరసనకు బయలుదేరుతున్న టిడిపి రాష్ట్ర కార్యదర్శి, అర్బన్ బ్యాంకు ఛైర్మన్ జె.ఎల్.మురళీధర్‌తోపాటు మాజీ కార్పొరేటర్ డైరెక్టర్ రాయల్ మురళి, టిఎన్ఎస్ఎఫ్ నాయకులు లక్ష్మీనరసింహ, ఎన్.బి.కె ఫ్యాన్స్ అధ్యక్షులు శ్రీధర్‌రాయల్, అర్బన్ బ్యాంకు డైరెక్టర్ వెంకటాద్రి, తదితరులను తెల్లవారుజామున 5 గంటల నుంచే అరెస్టు చేశారు. అరెస్టు చేసిన వెంటనే అనంతపురంలోని పలు పోలీస్‌స్టేషన్లకు తిప్పుతూ చివరకు 4వ పట్టణ పోలీస్‌స్టేషన్‌లో ముందస్తు అరెస్టు చూపారు.

ఆత్మకూరు : మండల పరిధిలోని పలు గ్రామాల్లో చంద్రబాబు అరెస్టుకు నిరసనగా టిడిపి నాయకులు ఆందోళన చేపట్టారు. ఇందులో భాగంగా అనంతపురం-కళ్యాణదుర్గం ప్రధాన రహదారిపై బైఠాయించి ధర్నా, రాస్తారోకో నిర్వహించారు. దీంతో ప్రధాన రహదారుల్లో ఎక్కడి వాహనాలు అక్కడే నిలిచిపోయాయి. విషయం తెలుసుకున్న ఎస్ఐ జనార్దన జోక్యం చేసుకుని ఆందోళనకారులను అరెస్టు చేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల కన్వీనర్ గంతి శ్రీనివాసులు, టిడిపి నాయకులు పాల్గొన్నారు.

నార్పల : చంద్రబాబు అరెస్టుకు నిరసనగా టిడిపి నాయకులు ఆందోళన చేపట్టారు. అదేవిధంగా మండల పరిధిలోని నాయనపల్లి, మద్దలపల్లి, గంగనపల్లి, పప్పూరు తదితర గ్రామాల్లో టిడిపి నాయకులు రోడ్డుపై బైఠాయించి నిరసన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమాల్లో టిడిపి నాయకులు ప్రతాప్‌చౌదరి, చంద్రబాబు, తిప్పన్న, బాలనాగ, నరేష్, చిన్నా చౌదరి, రాధాకృష్ణ, గంగనపల్లి రమణ, తదితరులు పాల్గొన్నారు. అలాగే మండల కేంద్రంలో టిడిపి జిల్లా నాయకులు ఆలం వెంకట నరసానాయుడు ఆధ్వర్యంలో నిరసన చేపట్టారు. ఈ కార్యక్రమంలో వెంకటేశ్వర్‌నాయుడు, మండల కన్వీనర్ ఎర్రి నాగప్ప, మాజీ ఎంపిటిసి రాఘవనాయుడు, మాజీ సర్పంచి బొగ్గు నారాయణస్వామి, సర్పంచులు వెంకటనారాయణమ్మ, బొగ్గు నాగార్జున, చంద్రబాబు, రాధాకృష్ణ, క్లస్టర్ ఇన్‌ఛార్జిలు పిఎల్ లక్ష్మీనారాయణ, తలారి కుళ్లాయప్ప, వెంకటనారాయణరెడ్డి, కార్యకర్తలు పాల్గొన్నారు.

బొమ్మనహాల్ : మండలంలోని పలు గ్రామాల్లో టిడిపి నాయకులు ఆందోళనలు చేపట్టారు. ఈ సందర్భంగా పలువురు టిడిపి నాయకులను పోలీసులు అరెస్టు చేశారు. ఇందులో భాగంగా స్థానిక పోలీస్‌స్టేషన్‌లో టిడిపి మండల కన్వీనర్ బలరామ్‌రెడ్డి విలేకరులతో మాట్లాడుతూ చంద్రబాబు అరెస్టు అప్రజాస్వామికమన్నారు. అంతేగాకుండా తమ అధినేతను అరెస్టు చేస్తే ప్రశాంతంగా తాము ఆందోళన చేయాలని చూస్తుంటే ముందస్తు అరెస్టులకు పాల్పడటం బాధాకరమన్నారు. వెంటనే చంద్రబాబును విడుదల చేయాలని, లేనిపక్షంలో ఆందోళనలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో కొత్తపల్లి మల్లికార్జున, దర్గాహొన్నూరు కేశప్ప, తదితరులు పాల్గొన్నారు.

శింగనమల : మండల కేంద్రంలోని అంబేద్కర్ విగ్రహం వద్ద శాంతియుతంగా ధర్నా చేస్తున్న తెలుగు యువత రాష్ట్ర అధికార ప్రతినిధి దండు శ్రీనివాసులును పోలీసులు అరెస్టు చేసి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్కిల్ డెవలప్‌మెంట్ కేసులో ఎలాంటి ఆధారాలు లేకుండా చంద్రబాబును అరెస్టు చేయడం బాధాకరమన్నారు. వెంటనే చంద్రబాబును విడుదల చేయాలని, లేనిపక్షంలో ఆందోళనలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు జిలాన్, సి.వెంకటేష్, కుళ్లాయప్ప, ఆదినారాయణ, బండి పరుశురాం, బెస్త నారాయణస్వామి, అనంతనేని చౌదరి, మల్లికార్జున, దేరంగుల శంకరయ్య, మహమ్మద్‌గౌస్, ముతవల్లి బాషా, కాయల సురేష్‌యాదవ్, ప్రసాద్‌నాయక్, తదితరులు పాల్గొన్నారు.అలాగే టిడిపి అధికార ప్రతినిధి దేగల కృష్ణమూర్తి ఆధ్వర్యంలో మండల కేంద్రం సమీపంలోని మరుపకొమ్మలో అనంతపురం-తాడిపత్రి జాతీయ రహదారిపై రాస్తారోకో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ యార్డు మాజీ డైరెక్టర్ మాసుల చంద్రమోహన్, పెద్ద నాగముని, జిల్లా బీసీ సెల్ కార్యనిర్వాహక కార్యదర్శి కొయ్యగూర పెద్దన్న, ఎస్సీ సెల్ అధ్యక్షుడు దాల్ వీరనారాయణ, బాలిరెడ్డి, రవీంద్రనాథ్‌రెడ్డి, తరిమెల చిరంజీవి, బోయ సుధాకర్ పాల్గొన్నారు

పుట్లూరు : చంద్రబాబు అరెస్టును నిరసిస్తూ శనివారం మండలంలోని ఏ.కొండాపురం గ్రామంలో టిడిపి ఆధ్వర్యంలో చేపట్టిన ధర్నాను పోలీసులు భగ్నం చేశారు. శాంతియుతంగా నిరసన తెలిపేందుకు కూడా అనుమతి ఇవ్వరా.. అంటూ టిడిపి నాయకులు పోలీసులతో వాగ్వివాదానికి దిగారు. వెంటనే సీఐ సుబ్రమణ్యం, ఎస్.ఐ దిలీప్‌కుమార్ సిబ్బందితో కలిసి టిడిపి నాయకులు, కార్యకర్తలను అరెస్టు చేసి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఈ కార్యక్రమంలో టిడిపి జిల్లా కార్యనిర్వాహక కార్యదర్శి సుదర్శన్‌నాయుడు, మండల కన్వీనర్ బాల రంగయ్య, టిడిపి నాయకులు కుంశేఖర్‌రెడ్డి, విజయ్‌కుమార్ నాయుడు, రవిచంద్రనాయుడు, శివశంకర్‌రెడ్డి, సోముశేఖర్ నాయుడు, ఓబుళనాయుడు, ఆదినారాయణరెడ్డి శ్రీనివాసులురెడ్డి, రవీంద్రచౌదరి, నాగేశ్వర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

రాయదుర్గం : టిడిపి అధినేత చంద్రబాబు అరెస్టును ఖండిస్తూ రాయదుర్గం ఎన్టీఆర్ సర్కిల్‌లో ఎన్టీఆర్ విగ్రహం వద్ద, వినాయక కూడలిలో టిడిపి నాయకులు నిరసన వ్యక్తం చేశారు. మరికొందరు టిడిపి నాయకులు

రాయదుర్గంలో ఆందోళన చేస్తున్న టిడిపి నాయకులు

శాంతియుతంగా నిరసన ప్రదర్శన చేశారు. విషయం తెలుసుకున్న పోలీసులు జిల్లా పరిషత్ మాజీ అధ్యక్షులు పూల నాగరాజు, టిడిపి పట్టణ అధ్యక్షుడు పసుపులేటి నాగరాజు, రాయదుర్గం మండల కన్వీనర్ కురుబ హనుమంతు, జిల్లా అధికార ప్రతినిధి పొరాళు పురుషోత్తంతోపాటు మరో 24 మందిని అరెస్టు చేసి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు.

గుత్తి : చంద్రబాబు అరెస్టును నిరసిస్తూ గుత్తిలో శనివారం టిడిపి ఆధ్వర్యంలో రాస్తారోకో నిర్వహించారు. పట్టణంలోని గాంధీ కూడలిలో 44,67వ జాతీయ రహదారులపై నాయకులు బైఠాయించి ఆందోళన చేపట్టారు. సమాచారం తెలుసుకున్న సీఐ ఎం. వెంకటరామిరెడ్డి చేరుకుని ఆందోళనకారులను అరెస్టు చేసి పోలీస్‌స్టేషన్ తరలించారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ యార్డ్ మాజీ ఛైర్మన్ మోడే శ్రీనివాస్‌యాదవ్, మాజీ కౌన్సిలర్ జి.సుంకన్న, మాజీ సర్పంచులు నరసింహులు, వెంకటరాముడు, వైకుంఠ, నాయకులు ఎన్.కేశవనాయుడు, కోనంకి కృష్ణ, భాస్కర్‌స్వామి, ఎస్ఎం బాషా, వేణు, ఎ.గోవర్ధన్‌గౌడ్, సాంబశివుడు, కె.సుధాకర్‌యాదవ్, గోరంట్ల నాగరాజు, కోనా లక్ష్మణరావు, బోయగడ్డ రాముడు, కొత్తపేట సూరి, తదితరులు పాల్గొన్నారు.

యాడికి : చంద్రబాబు అరెస్టును నిరసిస్తూ టీడీపీ ఆధ్వర్యంలో మండలంలోని రాయల చెరువు జాతీయ ప్రధాన రహదారిపై నిరసన వ్యక్తం చేశారు. సమాచారం అందుకున్న ఎస్ఐ అంబటి గురుప్రసాద్‌రెడ్డి సిబ్బందితో వెళ్లి మండల కన్వీనర్ రుద్రమనాయుడు తదితరులను అరెస్టు చేసి స్టేషన్‌కు తరలించారు. అరెస్టు చేసిన వారిలో మాజీ ఎంపిపి వేలూరు రంగయ్య, నాయకులు పరిమి చరణ్, మదమంచి శివ, శేఖర్, అనిల్, మెకానిక్ బాబు, నాగరాజు, రవికుమార్‌రెడ్డి, మౌలాలి, కోడూరు నీలకంఠారెడ్డి, రంగస్వామి, రమేష్, నరేంద్రబాబు, జాఫర్, తదితరులు ఉన్నారు.

బెలుగుప్ప : చంద్రబాబును వెంటనే విడుదల చేయాలని టిడిపి ఆధ్వర్యంలో శనివారం మండల పరిధిలోని నరసాపురం జాతీయ రహదారిపై రాస్తారోకో నిర్వహించారు. విషయం తెలుసుకున్న ఎస్ఐ రామకృష్ణయ్య సిబ్బందితో చేరుకుని టిడిపి నాయకులను అరెస్టు చేసి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఈకార్యక్రమంలో టిడిపి నాయకులు మండల కన్వీనర్ ప్రసాదు, పెద్ద తిప్పయ్య, మల్లికార్జున, నరిగన్న, టిడిపి కార్యకర్తలు పాల్గొన్నారు.

ఉరవకొండ : చంద్రబాబు అక్రమ అరెస్టుకు నిరసనగా శనివారం ఉరవకొండలో టిడిపి నాయకులు రాస్తారోకో నిర్వహించారు. వెంటనే పోలీసులు ఆందోళనకారులను అరెస్టు చేసి స్టేషన్‌కు తరలించారు. అరెస్టయిన వారిలో టిడిపి మండల కన్వీనర్ విజయ్‌భాస్కర్, రామకృష్ణ, రామాంజనేయులు, ఇంద్రావతి సుధాకర్, వార్డు సభ్యులు రామాంజనేయులు, ఓబులేసు, తాజుద్దీన్ తదితరులు పాల్గొన్నారు. అలాగే విడపనకల్ మండలంలో టిడిపి నాయకులు, సర్పంచులను పోలీసులు ముందస్తు అరెస్టు చేశారు. అరెస్టు అయిన వారిలో టిడిపి జిల్లా పార్లమెంటరీ కార్యదర్శి హనుమంతు, సర్పంచులు తిప్పారెడ్డి, ధనుంజయ, చంద్రశేఖర్, తదితరులు ఉన్నారు.

కళ్యాణదుర్గం : చంద్రబాబు అరెస్టు అప్రజాస్వామికమని మాజీ ఎమ్మెల్యే ఉన్నం హనుమంతరాయచౌదరి ఆగ్రహం వ్యక్తం చేశారు. శనివారం తన స్వగృహంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో అవినీతి, అరాచక పాలన సాగుతోందన్నారు. రాష్ట్రంలో జరుగుతున్న ప్రతి విషయాన్ని ప్రజలు గమనిస్తున్నారని నాలుగునెలల్లో ముఖ్యమంత్రిని ఇంటికి పంపడం ఖాయమన్నారు.

నార్పలలో నిరసన తెలుపుతున్న టిడిపి నాయకులు

రాయదుర్గంలో రాస్తారోకో నిర్వహిస్తున్న టిడిపి నాయకులు

విలేకరులతో మాట్లాడుతున్న మేయర్ వసీం

చట్టానికి చంద్రబాబు అతీతుడు కాదు : మేయర్

ప్రజాశక్తి-అనంతపురం కార్పొరేషన్

చట్టానికి టిడిపి అధినేత చంద్రబాబు అతీతుడు కాదని మేయర్ మహమ్మద్ వసీం అన్నారు. శనివారం తన కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ స్కిల్ డెవలప్‌మెంట్ కేసులో అవినీతి జరిగినట్లు ఆధారాలు ఉన్నాయి కాబట్టే చంద్రబాబును అరెస్టు చేశారన్నారు. ఇన్నేళ్లు చంద్రబాబు తాను నిప్పు అంటూ రాష్ట్ర ప్రజలను మోసం చేశారని ఆరోపించారు. అంతేగాకుండా జిల్లాలోని రాయదుర్గంలో తనను త్వరలో అరెస్టు చేస్తారని స్వయానా చంద్రబాబు చెప్పి నిజాన్ని ఒప్పుకున్నారన్నారు. 14 ఏళ్ల పాటు ముఖ్యమంత్రిగా పనిచేసిన చంద్రబాబుపై పలు కేసులు ఉన్నాయన్నారు. అయితే రకరకాల కారణాలతో ఇప్పటిదాకా బయట పడ్డారన్నారు. ప్రస్తుతం నమోదు చేసిన కేసులో పక్కా ఆధారాలు ఉన్నాయి కాబట్టే అరెస్టు చేశారన్నారు. స్కిల్ డెవలప్‌మెంట్ కుంభకోణంలో నకిలీ ఇన్వాయిస్‌తో సెల్ కంపెనీలకు రూ.371 కోట్లను నిధులు మళ్లించి తిరిగి మళ్లీ చంద్రబాబు తనకు, తన అనుయాయులకు లబ్ధి చేకూర్చారని ఆరోపించారు. చట్టం ముందు తప్పు ఎవరు చేసినా శిక్ష అనుభవించక తప్పదన్నారు. ఈ సమావేశంలో కార్పొరేటర్లు ఇషాక్, అనిల్‌కుమార్‌రెడ్డి, సైపుల్లా పాల్గొన్నారు.

ఆంజనేయ స్వామికి ప్రత్యేక పూజలు

పూజలందుకున్న నేమకల్లు ఆంజనేయస్వామి

బొమ్మనహాల్ : శ్రావణమాసం నాలుగో శనివారాన్ని పురస్కరించుకుని మండలంలోని నేమకల్లులో వెలసిన ఆంజనేయస్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఇందులో భాగంగా స్వామివారికి పన్నీటి స్నానాలు ఆచరించి వెండి కవచం, సువర్ణ కిరీటాన్ని అలంకరించారు. అనంతరం తమలపాకల పూజ చేసినట్లు అర్చకులు అనిల్ స్వామి తెలిపారు. భక్తులు భారీగా తరలిరావడంతో ఆలయం కిటకిటలాడింది. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా చర్యలు చేపట్టినట్లు ఆలయ చీఫ్ అధికారి నరసింహారెడ్డి తెలిపారు. సాయంకాలం ఆలయంలో పూలరథోత్సవం నిర్వహించారు. ఆదివారం తెల్లవారుజామున రథోత్సవం, సాయంత్రం బ్రహ్మ రథోత్సవం నిర్వహించనున్నట్లు ఆలయ అధికారి తెలిపారు.

పెందోట బాల సాహిత్య పురస్కారాన్ని అందుకున్న యువకవి చంద్రశేఖర్

ప్రజాశక్తి-బెలుగుప్ప

శీర్పి చంద్రశేఖర్‌కు పురస్కారం అందజేసి సన్మానిస్తున్న పెందోట బాల సాహిత్య పీఠం సభ్యులు

మండలంలోని వెంకటాద్రిపల్లి గ్రామానికి చెందిన శీర్పి చంద్రశేఖర్ శనివారం పెందోట బాల సాహిత్య పురస్కారాన్ని అందుకున్నట్లు పీఠం వ్యవస్థాపకులు, కవి రచయిత పెందుట వెంకటేశ్వర్లు తెలిపారు. తెలంగాణ రాష్ట్రం సిద్ధిపేట జిల్లాలో జరిగిన పెందోట బాలసాహిత్య పురస్కార అవార్డు వేడుకల్లో చంద్రశేఖర్‌కు అవార్డు అందకున్నారన్నారు. ఈ సందర్భంగా ప్రముఖ కవులు మాట్లాడుతూ చిన్న వయసులోనే మట్టి రెక్కల చందమామ, కాలుతున్న వెన్నెల అనే రెండు పుస్తకాలను చంద్రశేఖర్ రచించడం అభినందనీయమని కొనియాడారు. భవిష్యత్తులో ఇంకా ఎన్నో పుస్తకాలు రాసి మంచి విజయాలు అందుకోవాలని ఆకాంక్షించారు.

బీఎస్పీ బలోపేతానికి కృషి

ప్రజాశక్తి-ఉరవకొండ

మాట్లాడుతున్న బీఎస్పీ నాయకులు

బహుజన సమాజ్ పార్టీ బలోపేతానికి కృషి చేయాలని ఆ పార్టీ జిల్లా అధ్యక్షులు గద్దల నాగభూషణం, జిల్లా ఇన్‌ఛార్జి లక్ష్మీనారాయణ పిలుపునిచ్చారు. శనివారం ఉరవకొండలోని శ్రీ గాంధీ హరిజన హాస్టల్ ప్రాంగణంలో బీఎస్పీ మండల కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బహుజనులు రాజకీయంగా, ఆర్థికంగా బలోపేతం కావాలన్న ఉద్దేశంతో ఆనాడు కాన్షీరాం బీఎస్పీని స్థాపించారన్నారు. కాన్షీరాం వేసిన బాటలో మాయావతి నడుస్తోందన్నారు. దేశంలోనే అతిపెద్ద రాష్ట్రమైన ఉత్తరప్రదేశ్ రాష్ట్రానికి ముఖ్యమంత్రిగా పని చేసి ఆదర్శంగా నిలిచిందన్నారు. ఈ కార్యక్రమంలో నూతన అధ్యక్షులు రాము, ఎస్సీ, ఎస్టీ, బీసీ సంఘాల నాయకులు మధు, పురుషోత్తం, ధనంజయ, రామంజి, భీమేష్, సిసింద్ర, సురేంద్ర, తదితరులు పాల్గొన్నారు.

ఆంజనేయ స్వామి రథోత్సవం

రాయదుర్గం : పట్టణంలోని జాతీయ రహదారి చెక్‌పోస్టు వద్ద వెలసిన అభయాంజనేయస్వామి రథోత్సవం శనివారం వైభవంగా సాగింది. శ్రావణమాసం ఆఖరి శనివారాన్ని పురస్కరించుకుని ఆలయ ఆవరణలో ఆంజనేయ స్వామికి ప్రత్యేక పూజలు, హోమాలు నిర్వహించారు. అనంతరం ఉత్సవమూర్తిని రథంపై ఉంచి పట్టణ వీధుల్లో ఊరేగించారు. అనంతరం ఆలయం వద్ద అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ నిర్వాహకులు కోదండ సత్యనారాయణ, సభ్యులు, భక్తులు, మహిళలు పాల్గొన్నారు.

రథోత్సవంలో పాల్గొన్న భక్తులు

కూతలేరు బ్రిడ్జి పనులను పూర్తి చేయాలి : సిపిఎం

ప్రజాశక్తి-నార్పల

మండల కేంద్రం నడిబొడ్డున ఉన్న అర్ధాంతరంగా ఆగిన కూతలేరు వంతెన నిర్మాణం పనులున వెంటనే పూర్తి చేయాలని సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఓ.నల్లప్ప, మండల కార్యదర్శి కె.కుళ్లాయప్ప శనివారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. ఏళ్లు గడుస్తున్నా కూతలేరు బ్రిడ్జి నిర్మాణం పూర్తికాకపోవడం బాధాకరమన్నారు. ప్రతిసారి ఎన్నికల ముందు కూతలేరు బ్రిడ్జి నిర్మాణం చేస్తామని హామీ ఇవ్వడం తప్ప చేసింది శూన్యమన్నారు. ఇటీవల మండల పరిధిలోని గూగూడు కుళ్లాయిస్వామి బ్రహ్మోత్సవాల సందర్భంగా బ్రిడ్జి కింద తూతూమంత్రంగా మట్టి వేసి వాహనాలను దారి మళ్లించారు. దాదాపు 12 సంవత్సరాలు పూర్తి కావస్తున్నా బ్రిడ్జి నిర్మాణం పూర్తి కాకపోవడంతో మండలవాసులు అసహనం వ్యక్తం చేస్తున్నారన్నారు. ముఖ్యంగా స్థానికులతోపాటు ఆ ప్రాంతంలో ప్రయాణించే ప్రయాణికులు దుమ్మూధూళి కారణంగా అనారోగ్యం పాలవుతున్నారన్నారు. ఇక వర్షాకాలం వస్తే వర్షం నీటికి రాకపోకలు నిలిచిపోతున్నాయి. దీంతో మండల కేంద్రానికి అవతల ఉన్న వారు జిల్లాకేంద్రానికి వెళ్లాలంటే తీవ్ర ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తోందన్నారు. ఇప్పటికైనా నాయకులు, అధికారులు స్పందించి కూతలేరు బ్రిడ్జి నిర్మాణాన్ని పూర్తిచేయాలని, లేనిపక్షంలో సిపిఎం ఆధ్వర్యంలో ఆందోళనలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

లోక్ అదాలత్‌లో పలు కేసులు పరిష్కారం

ప్రజాశక్తి-గుత్తి

పట్టణంలోని న్యాయస్థానాల ప్రాంగణంలో శనివారం జరిగిన జాతీయ లోక్ అదాలత్‌లో 605 కేసులు పరిష్కారమయ్యాయి. గుత్తి మండల న్యాయ సేవా సమితి అధ్యక్షురాలు, 6వ అదనపు ఇన్‌ఛార్జి న్యాయమూర్తి కె. శోభారాణి, సీనియర్ సివిల్ జడ్జి టి.హరిత, జుడీషియల్ ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్ వి.దీప్తి ఆధ్వర్యంలో లోక్ అదాలత్ నిర్వహించగా వివిధ కేసుల్లో జరిమానా రూపంలో రూ.57,90,715 కక్షిదారులకు వసూలు చేశారు. ఈ కార్యక్రమంలో గుత్తి బార్ అసోసియేషన్ అధ్యక్షులు కె.మనోహర్‌బాబు, ఏపీపీ బి.సుదర్శన్ రెడ్డి, ఏజీపీ పివి.తిమ్మారెడ్డి, న్యాయవాదులు జెడ్.సతీష్, ఎంవి.మహేష్, మహ్మద్ రసూల్, ఎస్.జాకీర్‌హుస్సేన్, ఎ.రామ్మోహన్‌రెడ్డి, కోర్టు సిబ్బంది ఎస్.సాదిక్ వలి, నవాజ్ తదితరులు పాల్గొన్నారు.

రాయదుర్గం : రాయదుర్గంలోని జూనియర్ సివిల్ జడ్జి కోర్టులో శనివారం జరిగిన జాతీయ లోక్ అదాలత్‌లో ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్ కోర్టు పరిధిలో వివిధ కేసులకు పరిష్కారంఉ చూపారు. సెకండ్ క్లాస్ మేజిస్ట్రేట్ కోర్టు పరిధిలో ఎస్‌టిసి , పెట్టీ కేసులు 1172కు రూ.12,26,186 సీజ్ చేయగా ఆయా కేసులకు సంబంధించి రూ.1,73,300 జరిమానా విధించారు. ఈ కార్యక్రమంలో మండల న్యాయసేవా అధికార సంస్థ ఛైర్మన్ స్పెషల్ మొబైల్ కోర్టు ప్రిసైడింగ్ అధికారి జె.సుజిన్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

గుత్తి లోక్ అదాలత్‌కు హాజరైన అధికారులు, బాధితులు

మూగజీవాలకు వైద్యం అందించడం అభినందనీయం

జెడ్పీ ఛైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ

ప్రజాశక్తి-అనంతపురం

(పెట్ క్లినిక్, సర్జికల్ క్లినిక్)ను ప్రారంభిస్తున్న జెడ్పీ ఛైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ

నోరు లేని మూగ జీవాలకు వైద్యం అందించేందుకు ప్రత్యేక వర్షిపెట్ వరల్డ్ (పెట్ క్లినిక్, సర్జికల్ క్లినిక్)ను ప్రారంభించడం హర్షణీయమని జిల్లా పరిషత్ ఛైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ అన్నారు. శనివారం స్థానిక వేణుగోపాల్‌నగర్‌లో నూతనంగా ఏర్పాటు చేసిన వర్షి పెట్ వరల్డ్‌ను గిరిజమ్మ ప్రారంభించారు. ఈసందర్భంగా ఛైర్‌పర్సన్ మాట్లాడుతూ మూగజీవాలను అర్థం చేసుకుని చికిత్స ఇవ్వడం చాలా గొప్ప విషయమన్నారు. వర్షి పెట్ వరల్డ్ వారు 24 గంటలూ అత్యవసర సేవలను అందించడం చాలా హర్షణీయమన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక వైసిపి సీనియర్ నాయకులు డి.క్రిష్ణమూర్తి, ఇతర పుర ప్రముఖులు పాల్గొన్నారు.

కక్ష సాధింపుతోనే చంద్రబాబు అరెస్టు

జనసేన జిల్లా అధ్యక్షులు టిసి.వరుణ్

ప్రజాశక్తి-అనంతపురం

విలేకరులతో మాట్లాడుతున్న జనసేన జిల్లా అధ్యక్షులు టిసి.వరుణ్

రాజకీయ కక్షతోనే టిడిపి అధినేత నారా చంద్రబాబును అరెస్టు చేశారని జనసేన పార్టీ జిల్లా అధ్యక్షులు టిసి.వరుణ్ విమర్శించారు. శనివారం స్థానిక సప్తగిరి సర్కిల్‌లోని జనసేన జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన పాత్రికేయుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రజాస్వామ్యం మంట కలిసిందన్నారు. ప్రతిపక్ష నేతలు ప్రజల్లో తిరగకుండా అణిచివేయాలన్న కుటిల దుర్బుద్ధితో ప్రభుత్వం వ్యవహరించడం సిగ్గుచేటన్నారు. అక్టోబర్‌లో జనసేన అధ్యక్షులు పవన్ కళ్యాణ్ పట్ల కూడా పోలీసులు ఇలాగే వ్యవహరించారన్నారు. ప్రశ్నించేవారిని జైల్లో పెట్టడం వైసిపికి ఆనవాయితీగా పెట్టుకుందని ఎద్దేవా చేశారు. ప్రతిపక్ష నేతలు ప్రజల్లో తిరిగితే చాలు ఏదో ఒక నెపం మోపి అరెస్టులు చేయడం ద్వారా రాజ్యాంగం కల్పించిన హక్కులను కాలరాస్తామంటే పవన్ కళ్యాణ్ చూస్తూ ఊరుకోరన్నారు. నేడు జరిగే జనసేన పిఎసి సమావేశంలో భవిష్యత్తు ఉద్యమ కార్యాచరణతో ప్రజాస్వామ్యాన్ని విధ్వంసం చేస్తున్న వైసిపి మెడలు వంచుతామని హెచ్చరించారు. ఈ సమావేశంలో జిల్లా ఉపాధ్యక్షులు అంకే ఈశ్వరయ్య, జిల్లా ప్రధాన కార్యదర్శులు కుమ్మర నాగేంద్ర, కార్యదర్శులు జయమ్మ, అవుకు విజయకుమార్, ముప్పూరి కృష్ణ, నగర ప్రధాన కార్యదర్శులు మేదర వెంకటేష్, రోళ్ల భాస్కర్, వెంకటనారాయణ, నగర కార్యదర్శులు అంజి, వడ్డే వెంకటేష్, వెంకటరమణ, ఆకుల అశోక్, ఆకుల ప్రసాద్, వీర మహిళ దాసరి సరిత, నాయకులు హిద్దు, సల్మాన్, చిన్న, మధు, షామీర్ తదితరులు పాల్గొన్నారు.

ఆసుపత్రిలో అదనపు భవనాలు ప్రారంభం

ప్రజాశక్తి-గుత్తి

పట్టణంలోని ప్రభుత్వ సామాజిక ఆసుపత్రిలో నూతనంగా నిర్మించిన భవనాలను ఎంపీ తలారి రంగయ్య, ఎమ్మెల్యే వై.వెంకటరామిరెడ్డి శనివారం ప్రారంభించారు. నాబార్డ్ నిధులు రూ.1.95 కోట్లతో ఆసుపత్రిలో నూతన అదనపు వార్డుల్లో భవనాలను నిర్మించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ ఛైర్‌పర్సన్ డి.వన్నూరుబీ, ఎంపిపి జి.విశాలాక్షి, మార్కెట్ యార్డ్ ఛైర్‌పర్సన్ సి.సునీలాయాదవ్, డిసిహెచ్ఎస్ రవికుమార్, వైద్యాధికారి ఎం.వెంకటరమణ, ఆస్పత్రి అడ్వైజరీ కమిటీ సభ్యులు విశ్రాంత వైద్యాధికారి కృష్ణగోపాల్‌రెడ్డి, వై.సుభాష్‌రెడ్డి, డాక్టర్ వి.నాగేంద్ర, వైసిపి పట్టణ, మండల కన్వీనర్లు డి.హుస్సేన్‌పీరా, జి.గోవర్ధన్‌రెడ్డి, జిల్లా నాయకులు కె.మధుసూదన్‌రెడ్డి, బేడల వెంకటరాముడు, కౌన్సిలర్లు వరద, వాల్మీకి శివ, కెవి.రమణ, నరేష్, సర్పంచి యు.రామలింగమయ్య, తదితరులు పాల్గొన్నారు.

అదనపు గదులను ప్రారంభిస్తున్న ఎంపీ తలారి రంగయ్య, ఎమ్మెల్యే వైవిఆర్

In the court of the IVth Addl. District Judge, Ananthapuramu
E.P.No:551/2022 in A.A.No: 268/2019
Between:
Shriram City Union Finance Limited, Rayadurgam Rep by its Authorised Signatury, C.Muni Sekhar ...D.Hr
And
B.Sai Prasad and another ...J.Drs
Notice to J.Dr No:1
To
J.Dr No:1: B.Sai Prasad S/o B.Sreenivasulu, R/at D.No:1, B.C.Colony, Virupapalli (V), Siripi (P) Beluguppa (M) Ananthapuramu Dist.
పై నెంబరు కేసులో 1వ J.Dr అయిన మీ హాజరు నిమిత్తము 15-09-2023వ తేదీ ఉదయం 10-30 గంటలకు వాయిదా వేసినారు. ఆ రోజు మీరు స్వతహాగా గానీ లేక వకీలు ద్వారా గాని పై కోర్టులో హాజరై ఏమైన ఆక్షేపణలు తెలుపుకొనవలెను. లేని ఎడల పై కేసు మీ పరోక్షమున తీర్మానించెదరు.
(కోర్టు ఉత్తర్వుల మేరకు)
V.B.P.TEJA
Advocate for D.Hr, Anantapuramu
Cell:9700713342

కార్పొరేట్ల కొమ్ము కాస్తున్న కేంద్రం : జి.ఓబులు

ప్రజాశక్తి -పెనుకొండ

కేంద్ర ప్రభుత్వం కార్మికుల హక్కులను కాలరాసి కార్పొరేట్లకు కొమ్ముకాస్తోందని సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షుడు జి.ఓబులు విమర్శించారు. శనివారం పట్టణంలోని శ్రీసత్యసాయి డిగ్రీ కళాశాలలో సిఐటియు జిల్లా సదస్సును శనివారం నిర్వహించారు. ఈ సదస్సులో పాల్గొన్న ఓబులు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం కార్మిక చట్టాల సవరణ చేస్తూ కార్పొరేట్లు అంబానీ, ఆదానీల ఆస్తులు పెంచే విధంగా కేంద్రంలో ఉన్న బిజెపి ప్రభుత్వం చేస్తోందన్నారు. కార్మికులకు ఎనిమిది గంటల పని దినం నుంచి 12 గంటలు పెంచి మరింత శ్రమ దోపిడీ చేసేందుకు కుట్ర జరుగుతోందన్నారు. అసంఘటిత రంగంలో కార్మికులను నిర్వీరం చేసేలా కేంద్రం చర్యలు ఉండడం దుర్మార్గం అన్నారు. కార్మిక వ్యతిరేక విధానాలపై భవిష్యత్తులో పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపట్టేందుకు కార్మికలోకం సిద్ధం కావాలన్నారు. కార్మిక చట్టాల పరిరక్షణ కోరుతూ నిర్వహించే చలో ఢిల్లీ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. రాష్ట్రంలో మూడు లక్షల మంది కాంట్రాక్ట్ అవుట్‌సోర్సింగ్ కార్మికులు ఉంటే 2000 మంది కార్మికులను రెగ్యులర్ చేసి ప్రభుత్వం గొప్పగా ప్రచారం చేస్తోందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగులతో ఒపిఎస్ కాకుండా జిపిఎస్‌ను బలవంతంగా ఒప్పించేందుకు చూస్తోందన్నారు. అదేవిధంగా వాటర్ వర్క్స్ స్కీమ్‌కు సంబంధించి రాష్ట్రవ్యాప్తంగా జీతాలు లేని పరిస్థితి ఉందని, కార్మికులకు బకాయిలు జీతాలు అడిగినందుకు నిరసన చేపట్టినందుకు కార్మికులను సిఐటియు నాయకులను మీద కేసులు బనాయించడం దుర్మార్గం అన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు ప్రజలు, కార్మికులు బుద్ధి చెప్పడానికి ఎన్నికల్లో సిద్ధమవుతున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా అధ్యక్షులు శ్రీనివాసులు, జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్.వెంకటేష్, రమేష్, సాంబ, నరసింహులు, శ్రీదేవి, లక్ష్మీనారాయణ, బాబా తదితరులు పాల్గొన్నారు.

కక్షిదారులకు ప్రయోజనం

హిందూపురం : న్యాయస్థానాల్లో కక్షదారులు సత్వర న్యాయం పొందడం ద్వారా ఆర్థికంగా ఎంతో ప్రయోజనం చేకూరుతుందని అదనపు జిల్లా జడ్జి కంపల్లె శైలజ పేర్కొన్నారు. శనివారం స్థానిక కోర్టు ఆవరణలో జరిగిన జాతీయ మెగా లోక్ అదాలత్‌ను ఆమెతో పాటు న్యాయమూర్తులు శ్రీధర్, రాజ్యలక్ష్మిలు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏడీజే మాట్లాడుతూ కక్షిదారులు ఇబ్బందులకు కాకూడదన్న ఉద్దేశంతో లోక్ అదాలత్ నిర్వహిస్తున్నట్లు చెప్పారు. రాజీమార్గంలో కేసులను పరిష్కరించుకుంటే ఎలాంటి కక్షలకు అవకాశం ఉండదన్నారు. ఆర్థికంగా వెనుకబడిన వర్గాలకు ఇది ఎంతో ప్రయోజనకరంగా ఉంటుందన్నారు.